# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 25-05-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- వన్ ఫ్యామిలీ.. వన్ ఎంటర్ ప్రెన్యూవర్ కింద రాష్ట్రంలో పెద్ద ఎత్తున పారిశ్రామిక యూనిట్‌లు ఏర్పాటు కావాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆకాంక్షించారు.
- గోదావరి నది స్వచ్ఛతను కాపాడేందుకు పారిశ్రామికవేత్తలు సహకరించాలని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ విజ్ఞప్తి చేశారు.
- రహదారుల అభివృద్ధి, సాగునీటి సదుపాయాల మెరుగుదల కార్యక్రమాలను అమలు చేస్తున్నామని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు.
- కోస్తాంధ్రప్రదేశ్, రాయలసీమ ప్రాంతాల్లో రేపు కొన్నిచోట్ల వడగాలులు వీచే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది.

====================

వన్ ఫ్యామిలీ.. వన్ ఎంటర్ ప్రెన్యూవర్ కింద పెద్ద ఎత్తున పారిశ్రామిక యూనిట్‌లు ఏర్పాటు కావాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆకాంక్షించారు. విజయవాడలోని ఎంఎస్ఎంఈ గ్రోత్ సమ్మిట్-2026ను ఉద్దేశించి ముఖ్యమంత్రి ఈరోజు మాట్లాడుతూ... ఓ చిన్న ఆలోచనను పెద్ద పరిశ్రమగా మార్చే అవకాశం ఎంఎస్ఎంఈ లకు మాత్రమే ఉందన్నారు. రాష్ట్రంలో వనరులను వినియోగించుకునేలా ఎంఎస్ఎంఈలకు అవకాశం కల్పించామని, ఎంఎస్ఎంఈ పాలసీతో పాటు ప్రైవేటు పారిశ్రామిక పార్కుల పాలసీ కూడా తీసుకువచ్చామన్నారు. వ్యవసాయం తరవాత ఎక్కువ ఉద్యోగాలు కల్పిస్తున్న రంగం ఇదేనన్న ముఖ్యమంత్రి.. ప్రతీ నియోజకవర్గంలో ఒక ఏంఎస్ఎంఈ పారిశ్రామిక పార్క్ ఏర్పాటు చేయాలని నిర్ణయించామని చెప్పారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా అంకుర సంస్థలను ప్రోత్సహిస్తామని, రాష్ట్రం నుండి వంద యునికార్న్ సంస్థలు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ముఖ్యమంత్రి వివరిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

====================

రహదారుల అభివృద్ధి, సాగునీటి సదుపాయాల మెరుగుదల కార్యక్రమాలను ప్రభుత్వం వేగవంతంగా అమలు చేస్తోందని రాష్ట్ర గనులు, భూగర్భ వనరుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మచిలీపట్నం మండలం అరిసెపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని చిట్టిపాలెం రోడ్డులో "క్లీన్ మచిలీపట్నం" కార్యక్రమాన్ని గ్రామస్తులతో కలిసి ఆయన ఈరోజు నిర్వహించి, అనంతరం గ్రామంలో కాలువ పూడికతీత పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... రైతాంగానికి అవసరమైన సాగునీటి వ్యవస్థలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. మంత్రివర్గం ఆమోదంతో ఆపరేషన్ అండ్ మేనేజ్‌మెంట్ కింద కాలువల మరమ్మతులు, నిర్వహణ పనుల కోసం భారీగా నిధులు మంజూరు చేసినట్టు పేర్కొన్నారు. తాళ్లపాలెం, శివగంగ డ్రైన్లు, పోతిరెడ్డిపల్లె తదితర ప్రాంతాల్లో అవసరాలను గుర్తించి అంచనాలు సిద్ధం చేసి పనులు ప్రారంభించినట్టు మంత్రి వివరించారు.

====================

రాష్ట్రంలోని స్మశాన వాటికల్లో సమస్యలను పరిష్కరించి.. వాటిని సుందరంగా తీర్చిదిద్దనున్నట్టు జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు మండలం లంకలకోడేరు, భగ్గేశ్వరం గ్రామాలలో 65 లక్షల రూపాయల సీఎస్సార్ నిధులతో స్మశాన వాటిక అభివృద్ధి పనులను మంత్రి ఈరోజు ప్రారంభించారు. అనంతరం గ్రామస్తులతో కలిసి శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... స్మశానాల్లో అపరిశుభ్ర వాతావరణం నెలకొని ఉందని, వాటిని తీర్చిదిద్దవలసి ఉందని అన్నారు.

విరామం

====================

గోదావరి నది స్వచ్ఛతను కాపాడేందుకు పారిశ్రామికవేత్తలు సహకరించాలని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ విజ్ఞప్తి చేశారు. రాజమహేంద్రవరం పర్యటనలో భాగంగా ఆయన ఈరోజు పరిసర ప్రాంతాల పరిశ్రమల యాజమాన్యాలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ .. పరిశ్రమలు కాలుష్య వ్యర్థాల శుద్ధి ప్లాంట్లను పక్కాగా నిర్వహించాలన్నారు. పరిశ్రమల వ్యర్థాలను నేరుగా నదీ జలాల్లో కలపకూడదనే నిబంధన ఉందని, ఆధునిక పద్ధతుల ద్వారా పూర్తి స్థాయిలో శుద్ధి చేసిన తర్వాత మాత్రమే విడుదల చేయాలని అన్నారు. మూడు నెలలకోసారి కాలుష్య నియంత్రణ మండలి ఆడిట్ చేపడతామని చెప్పారు. పారిశ్రామికవేత్తలను ప్రభుత్వం ఇబ్బంది పెట్టదని అయితే.. పరిశ్రమల యాజమాన్యాలు కూడా ప్రభుత్వానికి సహకరించాలని అన్నారు. రాబోయే గోదావరి పుష్కరాలకు పారిశ్రామికవేత్తలు సామాజిక బాధ్యతతో సహకరించి విజయవంతం చేయాలని పవన్ కళ్యాణ్ కోరుతూ...

(వాయిస్ 28 సెకన్లు)

====================

ఎంఎస్ఎంఈలతో రాష్ట్రంలో సరికొత్త పారిశ్రామిక విప్లవానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాంది పలికారని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. విజయవాడలో ఈరోజు జరిగిన ఎంఎస్ఎంఈ గ్రోత్ సమ్మిట్-2026 కార్యక్రమంలో మంత్రి పాల్గొని మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని పారిశ్రామికంగా పరుగులు పెట్టించేందుకు ముఖ్యమంత్రి ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ను స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ గా మార్చారని అన్నారు. ప్రతి నియోజకవర్గంలో ఒక ఎంఎస్ఎంఈ పార్కు ఉండాలని ఆయన లక్ష్యంగా పెట్టుకున్నారని చెప్పారు. స్వర్ణాంధ్ర నిర్మాణం కోసం ప్రతి ఇంట్లో ఒక పారిశ్రామిక వేత్త ఉండాలన్న నినాదంతో ప్రతి ఒక్కరు ముందడుగు వేయాలని మంత్రి ఆకాంక్షించారు.

====================

ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ ఈరోజు రాజానగరంలోని అటవీ శాఖ ప్రాంతీయ పరిశోధనా కేంద్రాన్ని సందర్శించి.. అక్కడ పెంచుతున్న దేశీయ జాతి మొక్కలను, వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి గ్రామ పంచాయతీలోనూ దేశవాళీ జాతి మొక్కలతో ప్రత్యేక వనాన్ని తయారు చేయాలని,

మొక్కలను పెంచే బాధ్యతను గ్రామస్తులు తీసుకోవాలన్నారు. ఆదాయం తెచ్చే మొక్కల పెంపకం ద్వారా పంచాయతీలకు ఆర్థిక వృద్ధి కలుగుతుందని చెప్పారు. పర్యావరణ పరిరక్షణతో పాటు దేశీయ మొక్కలను ఎక్కువగా పెంచితే ప్రకృతి సమతుల్యత సాధ్యమవుతుందని, పంచాయతీరాజ్, అటవీశాఖ అధికారులు వెంటనే దీనిపై దృష్టి సారించి వనయజ్ఞం చేపట్టాలని ఉపముఖ్యమంత్రి సూచించారు.

====================

కోస్తాంధ్రప్రదేశ్, యానాంలలో కొన్నిచోట్ల రేపు వడగాలులు వీచే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. అలాగే.. కోస్తాంధ్ర, రాయలసీమలలో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉందని పేర్కొంది. అదే విధంగా గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీస్తాయని వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఇదిలా ఉండగా.. ఈ నెల 30వ తేదీ వరకు ఎండల తీవ్రత కొనసాగే అవకాశం ఉన్నందున, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ సూచించారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల మధ్య ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని, వడదెబ్బ తగలకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

====================

జిల్లాలో అక్షరాంధ్ర రెండో దశ కార్యక్రమాన్ని సమర్ధవంతంగా అమలు చేయాలని అనంతపురం జిల్లా సంయుక్త కలెక్టర్ సి. విష్ణు చరణ్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. అక్షరాంధ్ర రెండో దశ కార్యక్రమం అమలు, లక్ష్యాలు, యాప్ అనుసంధాన ప్రక్రియ తదితర అంశాలపై ఈరోజు ఆయన సమావేశం నిర్వహించారు.

====================
====================